బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- నిధుల కొరతతో నిలిచిన పనులు
- కంకర రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

వెల్దండ: ఏళ్లు గడుస్తున్నా తండావాసులకు రహదారి సమస్య తీరలేదు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టి కంకర వేసి వదిలేశారు. వెల్దండ మండలంలోని బైరాపూర్–కుందారంతండా, కలకొండ–కుందారంతండాలకు దాదాపుగా 3 కిలోమీటర్ల బీటీ నిర్మాణానికి 2022–23లో ప్రభుత్వం రూ.1.40 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా నేటికీ బీటీ రోడ్డుకు నోచుకోలేదు. అసంపూర్తిగా ఏర్పాటు చేసిన కంకర రోడ్డులో ప్రయాణం ఇబ్బందిగా మారిందని తండావాసులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుందారంతండా నుంచి బైరాపూర్ వరకు బీటీ నిర్మిస్తామని అప్పట్లో కాంట్రాక్టర్ కంకర పరిచి రెండేళ్లు గడిచినా పనులను పూర్తి చేయలే దు. దొంగరోడ్డు నుంచి రాచూర్‌తండా వరకు బీటీ కోసం ప్రభుత్వం రూ.50లక్షలు మంజూరు చేయ డంతో పనులు ప్రారంభించి కంకర వేసి వదిలేశారు.

కంకర రోడ్డుతో అవస్థలు

టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. పనులు మొదలు పెట్టి ఏళ్లు గడుస్తున్నా నేటికి బీటీ నిర్మాణం చేపట్టలేదు. మండల కేంద్రానికి చివరగా ఉన్న తండాలు, గ్రామాలకు బీటీ రోడ్డు పూర్తి చేసి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



వెల్దండ మండలం కుందారం-బైరాపూర్ మధ్య అసంపూర్తిగా బీటీరోడ్డు పనులు

బీటీరోడ్డు పూర్తి చేయాలి



బీటీరోడ్డు నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు కంకర వేసి వదిలేశారు. కంకర రోడ్డుతో కాలనీ వాసులం అవస్థలు పడుతున్నాం. దాదాపుగా కంకర వేసి రెండు ఏళ్లు గడిచినా నేటికీ బీటీరోడ్డు నిర్మించలేదు. అధికారులు స్పందించి అర్థాంతరంగా నిలిచిన పనులను చేపట్టి సమస్యను తీర్చాలి. కంకర రోడ్డులో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– రమేష్‌గౌడు, బైరాపూర్

త్వరలో బీటీ పనులు పూర్తి చేస్తాం

ప్రభుత్వం మారిన తరువాత నిధుల కొరతతో పనులు మందుకు సాగడం లేదు. ఎస్టీ కోటలో కుందారంతండా, రాచూర్ తండాలకు రోడ్డు మంజూరైంది. గతంలో కొంత పనులు చేసిన రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు పూర్తయ్యేలా కృషి చేస్తాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తాం.

– మహేందర్, పీఆర్‌ఏఈ, వెల్దండ

క్లుప్తంగా

వాహనాల తనిఖీ

చారకొండ: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గురువారం చారకొండ ఎస్‌ఐ శంషొద్దీన్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల సంబంధిత పత్రాలను పరిశీలించారు. రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది శేఖర్, ప్రశాంత్, సరిత, జంగయ్య ఉన్నారు.

ఘనంగా వృషభ వాహన సేవ



వెల్దండ: మండలంలోని గుండాల అంబారామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం తెల్లవారుజామున వృషభ వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలతో ఆలయ అవరణలో పల్లకీ సేవ నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్యశర్మ, వీరేశం శర్మ, శివశర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మ, సంతోష్‌శర్మ, తదితరులు ఉన్నారు.

పాఠశాలల పరిశీలన



తాడూరు: మండలంలోని శిర్సవాడ, పాపగల్ పాఠశాలలను గురువారం కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేష్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు పాఠశాల రిజిస్టర్లను పరిశీలించారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ఉప్పునుంతల: అచ్చంపేటలో వెల్టూరు మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు గురువారం ఉప్పునుంతల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది శుభాకర్, జగదీష్ పాల్గొన్నారు.

నేడు సెమినార్

పెంట్లవెల్లి: 'మనువాదం–దళిత మహిళా హక్కుల'పై సెమినార్‌ను శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌కు ముఖ్యఅతిథిగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కందికొండ గీత హాజరవుతారని తెలిపారు. సెమినార్‌కు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

12న కంటి వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ కొ్ట్ర బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌లోని 102 గదిలో ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440876556 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మాదిగల ఆత్మగౌరవ డప్పు మహాప్రదర్శన



నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 8న మాదిగల ఆత్మగౌరవ డప్పు మహాప్రదర్శన నిర్వహిస్తున్నామని, ఆ ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్ పిలుపునిచ్చారు. గురువారం బాబు జగ్జీవన్‌రామ్ స్టాచ్యూ వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ నివేదికలో ఉన్న లోపాలను సవరించి అన్ని కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రమోని యాదగిరి, గుడిగానిపల్లి రాజు, నాగన్న, విజయ్, భీమ్‌రాజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి పంపిణీ



వెల్దండ: మండలంలోని రాచూర్‌లోని ఉన్నత పాఠశాలకు పెద్దాపూర్ కెనరా బ్యాంక్ వారి సహకారంతో గురువారం రూ.40వేల విలువైన 4 బీరువాలు, రెండు కంప్యూటర్ టేబుల్ అందజేశారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ మేనేజర్ రంజిత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కెనరా బ్యాంక్ వారు కార్పొరేషన్ సోషల్ రెస్పాండ్(సీఎస్ ఆర్)సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంగయ్య, రాంకిషన్‌రావు, మురళీ మనోహర్, జైపాల్, సురేష్, భరత్, విష్ణుమూర్తి, అబ్దుల్లా ఉన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు



అల్లాపూర్‌లో బండారులో పాల్గొన్న భక్తులు



బీరప్ప ఉత్సవాల్లో కురువ కులస్తులు

తాడూరు/తెలకపల్లి: మండలంలోని అల్లాపూర్, ఇంద్రకల్ గ్రామాలలో కురువల ఆరాధ్యదైవం బీరప్ప స్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని తమ బంధువులను పండుగ సందర్భంగా పిలుచుకొని పెద్ద ఎత్తున పండుగ నిర్వహిస్తారు. పసుపును బంగారు భావించి ఒకరిపైన ఒకరు చల్లుకుంటూ ఆ ప్రాంతమంతా పసుపు మయంగా అవుతుంది.


- తెలకపల్లి మండల పరిధిలోని గట్టురాయపాకుల గ్రామంలో ఆరు రోజుల నుంచి బీరప్ప ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కురువ కులస్తులైన ఆదిగొండ వంశస్తులు ఆరో రోజు గురువారం బీరప్ప పెద్దపండుగను ఘనంగా నిర్వహించారు. డోలు చప్పుళ్లు, శివసత్తుల పూణాకాలు, బండారు వెసుకుని అంగరంగ వైభవంగా బోనాలతో ఊరేగించారు.

ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆరేళ్లుగా ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ నిధులను ప్రభుత్వం విడుదల చేయడం లేదని సీపీఐ జిల్లా అధ్యక్షుడు కొముమ భరత్ ఆరోపించారు. జిల్లా సీపీఐ కార్యాలయంలో గురువారం డీహెచ్‌పీఎస్ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఇండస్ట్రియల్ పాలసీ ద్వారా లబ్ధిదారులు తీసుకున్న సబ్సిడీ వాహనాలు, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని బ్యాంకు రుణాలు అందక అష్టకష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సబ్సిడీ రుణాలు విడుదల చేసి, నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు శివశంకర్, రాము, శ్రీను, లింగస్వామి పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి ఆలయం సిద్ధం

- 8నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన వాల్మీకి మహర్షి ఆలయం

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లిలో నిర్మించిన వాల్మీకి మహర్షి ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈనెల 8న ఆలయాన్ని ప్రారంభించి, అదేరోజు నుంచి 10వ తేదీ వరకు దేవతామూర్తుల ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు 8న గణపతిపూజ, గోపూజ, రక్షాబంధనం, అంకురార్పణ, అఖండ దీపారాధన, 9న ప్రాతఃకాల మండప పూజలు, గణపతి పూజ, గోపూజ, ప్రతిష్ఠా దేవత, హోమం, ధాన్యాధివాసం, 10న సీతారామ చంద్రస్వామి, వాల్మీకి, లక్ష్మణ, ఆంజనేయ, గణపతి దేవతామూర్తుల ప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు తరలివాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించాలి



ఆరోగ్య ఉపకేంద్రం వద్ద మాట్లాడుతున్న ఆర్ శ్రీనివాసులు

తెలకపల్లి: ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించి వైద్య సేవలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని కారువంగలో ప్రజల సమస్యలను పరిశీలించారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనం పూర్తయి ఏడాది గడిచినా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ప్రస్తుత ఆరోగ్య ఉపకేంద్రాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగించడం వల్ల సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోపాస్ లక్ష్మణ్, నందిపేట భాస్కర్, గోరటి కాశన్న, గ్రామస్తులు తిరుపతి, సత్యనారాయణ, శంకర్, బాలమ్మ, సరస్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

కొల్లాపూర్: పట్టణంలోని 7,8 వార్డుల్లో పేదలకు బీసీ కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించి, వాటికి పట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఆయా వార్డుల్లో పర్యటించారు. అనంతరం శివవర్మ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల క్రితం బీసీ కాలనీలో పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. చాలా మందికి పట్టాలిచ్చినా ఇంటి స్థలాలు మాత్రం చూపలేదన్నారు. కార్యక్రమంలో సలీం, తారాసింగ్, రాజు, లక్ష్మయ్య, రాంబాబు తదితరులున్నారు.

విద్యార్థులను పాఠశాలకు పంపించాలి



విద్యార్థులు, తల్లిదండ్రులతో అధికారులు

తెలకపల్లి: క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలకు పంపించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీశైలం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో రెగ్యులర్‌గా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు హాజరు కావడంలేదన్నారు. కైలాస సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో వారం రోజులుగా గ్రామాలు తిరుగుతూ పాఠశాలకు వెళ్లని పిల్లలను గుర్తించి వారి కుటుంబాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ చైతన్యం చేశామన్నారు. అధికారి శ్రీశైలంతో పాటు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, కోనేరు సంస్థ డైరెక్టర్ సలీమ్, హెచ్‌ఎం శ్రీనివాసులు, సంస్థ చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది ప్రమీల, మల్లేష్, ఆంజనేయులు, శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్, రజిత పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

వెల్దండ: మండల కేంద్రంలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాతంగా ప్రారంభమయ్యాయి. మోడల్ హైస్కూల్ 141 మంది విద్యార్థులకు, ఇద్దరు గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 180 మంది విద్యార్థులకు అందరూ హాజరైనట్లు తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాలను జిల్లా పరిశీలకులు మధన్ మోహన్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో గోపాల్‌రావు, రమాకాంత్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ప్రతి విద్యార్థికి రాగి జావ అందించాలి



లింగాల: క్రమం తప్పకుండా మెనూ ప్రకారం ప్రతి విద్యార్థికి తప్పని సరిగ్గా రాగి జావ అందించాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. గురువారం మండలంలోని సూరాపూర్, మగ్దుంపూర్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ పరిశీలించారు. విద్యార్థికి అపార్ ఐడీ జనరేట్ చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పర్వతాలు, ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా



కోడేరు: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, సీఈఓ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బస్తా ధర రూ.270లు ఉంటుందని, కావల్సిన రైతులు పట్టాదారు పాసుబుక్కు, ఆధార్‌కార్డు జిరాక్స్ తేవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంటల నమోదు తప్పనిసరి



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో గురువారం వ్యవసాయ అధికారులు రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన వరిపంట, మొక్కజొన్న తదితర పంటలను ఆన్‌లైన్ నమోదు చేయించాలన్నారు. పంటలను ఆన్‌లైన్ నమోదు చేయడంతో ప్రభుత్వం అందించే నష్టపరిహారం అందే అవకాశం ఉందన్నారు. ధాన్యం విక్రయించడానికి సులువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గణేష్, సురేష్, బిన్నతి, ప్రసన్నలక్ష్మి, అభిమానిస్సా, విజయలక్ష్మి, ప్రవీన్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని పీయూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మొగులయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తర్నికల్, వేపూరు, తోటపల్లి, ఎల్లికట్ల, రఘుపతిపేట, కుర్మిద్ద, కల్వకుర్తి పట్టణంలోని పలు పాఠశాలలో సంఘం సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామస్వామి, శైలం, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



ఐతోలు నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

తాడూరు/చారకొండ: మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలలోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని ఐతోల్, బలాన్‌పల్లి, అంతారం గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఏపీఓ చంద్ర సిద్ధార్థ, ఆయా గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

- నర్సరీలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. చారకొండ మండలంలోని సిర్సనగండ్ల, రామచంద్రాపురం గ్రామాల్లో పర్యటించి వననర్సరీలను పరిశీలించారు. వాటి సంరక్షణకు నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, సురేందర్ రెడ్డి, శ్రీను, మల్లికార్జున్ ఉన్నారు.

ఇళ్ల ముందు డప్పులతో దండోరా



ఆస్తిపన్ను కట్టని వారి ఇళ్ల వద్ద డప్పులతో దండోరా వేయిస్తున్న మున్సిపల్ అధికారులు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను కట్టని ఇళ్ల ముందు మున్సిపల్ అధికారులు డప్పులతో దండోరా వేయించారు. బుధవారం మున్సిపాలిటీలోని కమర్షియల్ భవనాలు, దుకాణాలు, ఇళ్ల మొండి బకాయిదారుల ఇళ్లకు వెళ్లి మున్సిపాలిటీ సిబ్బంది పన్ను చెల్లించాలని డప్పులు కొట్టారు. కమర్షియల్ దుకాణాల వద్దకు వెళ్లి వాటిని సీజ్ చేసి, పలు దుకాణాదారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోని వారిని వెంటనే తీసుకోవాలని హెచ్చరించారు. ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలని, లేని యెడల భవనాలను సీజ్ చేయటంతో పాటు నల్లా కనెక్షన్లు తొలగిస్తామన్నారు. బకాయిలు చెల్లించని వారిపై నూతన మున్సిపల్ చట్టం–2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ హెచ్చరించారు. వసూళ్లలో మున్సిపల్ మేనేజర్ రాజకుమారి, బిల్ కలెక్టర్ చంద్రయ్య, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రకల్‌లో మెగా వైద్య శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో గురువారం జిల్లా జనరల్ ఆస్పత్రి సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ సృజన మాట్లాడుతూ ఇటీవల ప్రబలుతున్న వ్యాధులు సిఫిలిఫ్, హైపోటైటిస్–బీసీ, హెచ్‌ఐవీ వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. శిబిరంలో 142 మందికి హైపోటైటిస్, సిఫిలిఫ్, హెచ్‌ఐవీతో పాటు జనరల్ వచ్చే బీపీ, షుగర్ వ్యాధులపై రక్త పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమలత, ఆంజనేయులు, అహ్మద్‌అలీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గెలుపుపై సంబరాలు



నాగర్‌కర్నూల్‌లో సంబరాలు నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు



కల్వకుర్తిలో బీజేపీ నేతల సంబరాలు

సాక్షి, నెట్‌వర్క్: నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి విజయంపై జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించడంతో బీజేపీ, తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు.

- కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆధ్వర్యంలో కల్వకుర్తిలో సంబరాలు నిర్వహించారు.
- అచ్చంపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు.
- వెల్దండ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై బీజేపీ నాయకులు బాణా సంచాకాల్చి సంబరాలు నిర్వహించారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష, జరిమానా

తిమ్మాజిపేట: మండలంలోని ఆవంచ గ్రామానికి చెందిన కొత్త శివకుమార్‌కు దొంగతనం కేసులో గురువారం ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ నరేందర్ రెడ్డి, కోర్టు కానిస్టేబుళ్లు హరిదాసు, జావిద్ తెలిపారు. బచ్చలకూర కేశవులు ఇంట్లో 2024లో అదే గ్రామానికి చెందిన శివకుమార్ రూ.1.50లక్షలు, బంగారు కమ్మలు, వెండి గొలుసులు చోరీ చేశాడు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేశా రు. బాధితుడి ఇంటికి సీసీ కెమెరా ఉండడంతో దొంగతనం చేసిన వ్యక్తిని గుర్తించి రిమాండ్‌కు తరలించారు. రూ.30 వేల నగదు రికవరీ చేశారు. స్పెషల్ మొబైల్ కోర్టు మొదటి అదనపు జడ్జి ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారన్నారు.

దాడి కేసులో ఇద్దరికి రిమాండ్

లింగాల: దాడి సంఘటనలో లింగాలకు చెందిన ప్రశాంత్, శ్రీకాంత్‌లను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని గత నెల 7వ తేదీన చిన్న నర్సింహ, వెంకటేశం, చలం అనే వ్యక్తులపై కత్తులు, ఇతర మారణాయుధాలతో దాడికి పాల్పడ్డాని ఎస్‌ఐ తెలిపారు. దాడికి పాల్పడిన వారు అప్పటి నుంచి పరారీలో ఉన్నారని, గురువారం పట్టుకొని కల్వకుర్తి కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్‌ఐ తెలిపారు. కల్వకుర్తి జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీ: వ్యక్తికి గాయాలు

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల సమీపంలో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని సింగోటం గ్రామానికి చెందిన విజేయుడు గాయపడ్డాడు. నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ వస్తున్న ఆర్టీసీ బస్సు పీజీ కళాశాల సమీపంలో ద్విచక్ర వాహనంపై కొల్లాపూర్ నుంచి సింగోటం వెళ్తున్న విజేయుడును ఢీ కొట్టింది. దీంతో ఆయన తలకు గాయమైంది. అటుగా వెళ్తున్న ప్రజావికాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కలమంద శేఖర్ గాయపడ్డ విజేయుడును అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

కొల్లాపూర్: ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ సూచించారు. గురువారం పలువురు లబ్ధిదారులు ఎల్‌ఆర్‌ఎస్ రెగ్యులరైజ్ చేసుకున్నారు. వారికి ధ్రువీకరణ పత్రాలను కమిషనర్ అందజేశారు. మార్చి 31వ తేదీ లోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకుంటే 25 శాతం రాయితీ సౌకర్యం ఉందని వివరించారు.

అపార్ ఐడీ నమోదుపై సమీక్ష

కొల్లాపూర్: అపార్ ఐడీ నమోదుపై గురువారం కొల్లాపూర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారులు సమీక్ష నిర్వహించారు. మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల హెచ్‌ఎంలతో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ షర్ఫొద్దీన్, ఎంఈఓ ఇమ్మానుయేల్ సమావేశమయ్యారు. అపార్ ఐడీ నమోదు వివరాలు తెలుసుకున్నారు. తప్పనిసరిగా నిర్ణీత గడువులోగా అపార్ ఐడీ నమోదు చేయాలని సూచించారు. ఐడీలు నమోదు చేయకుంటే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

పెద్దకొత్తపల్లి: కల్వకోల్ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చెన్నకేశవ స్వామి గుడి వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ నీరు వదిలితే సమస్య పరిష్కారం అవుతుందని సీపీఎం మండల కార్యదర్శి దశరథం అన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను అధ్యయనం చేశారు.